# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 123 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

13-03-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4


# జనం గుండెల్లో.. వైయస్సార్సీపి జెండా





- ప్రజలతోనే 15ఏళ్లు
- బాబు అనుభవం జనాన్ని మోసగించడానికే..
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వైయస్సార్సీపి క్రెడిట్ చోరీ చేస్తారా
- ఆగిపోయిన పలాస రైల్వే ఫ్లై ఓవర్ పనులు ఎవరు పునః ప్రారంభం చేశారో తెలుసా? మూలపేట పోర్ట్ చంద్రబాబు తెచ్చారని.. చెప్పుకోవడానికి సిగ్గు లేదా?
- పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ శంకుస్థాపన.. ప్రారంభోత్సవం వైయస్ జగన్ చేస్తే.. కళ్ళు కనిపించడం లేదా!
- పలాస లో 110 కోట్ల రూపాయలతో మంచినీటి ప్రాజెక్టుకు నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేస్తే.. కూటమి సర్కార్ తెచ్చిందంటూ.. డబ్బాలు కొట్టుకుంటారా..
- దమ్ముంటే వంశధార ఎడమ కాలువ ప్రాజెక్టుపై ఒడిస్సా సీఎంతో మాట్లాడి.. జిల్లాకు సాగునీరు కోసం కృషి చేయండి
- పలాసలో సూది కొండ, బెండి కొండ, రాజగోపాల పురం కొండ మాయం చేస్తున్నది తెలుగు తమ్ముళ్లే!
- వైయస్సార్సీపి ప్రభుత్వంలో చేపట్టిన ప్రాజెక్టులు దగ్గర ఫోటోలు తీసుకుని.. తామే తెచ్చామంటూ తప్పుడు ప్రచారం చేసుకుంటారా?
- రామకృష్ణాపురంలో 64 ఎకరాలు ఇండస్ట్రియల్ పార్కు కై భూసేకరణ తాము చేస్తే.. మీరు చేశామని ఫోటోలు తీసుకుంటారా?
- కేటి రోడ్.. మందస రోడ్డు.. అక్కుపల్లి రోడ్డు, స్మార్ట్ సిటీ, నిరుపేదలకు ఇంటి స్థలాలు వైఎస్ఆర్సిపి హయంలో జరిగితే.. కూటమి ప్రభుత్వంలో ఏం చేశారో చెప్పండి..
- గ్రావెల్.. లిక్కర్ టాక్స్ ఎవరు వసూలు చేస్తున్నారో?
- ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయి..
- 2029 లో జగనన్నను ముఖ్యమంత్రి చేయడమే వైయస్సార్సీపి శ్రేణుల లక్ష్యం కావాలి
- రాష్ట్ర మాజీ మంత్రి, వైయస్సార్సీపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు పార్టీ శ్రేణులకు దశ దిశ నిర్దేశం
- భారీగా తరలివచ్చిన వైయస్ఆర్సీపీ శ్రేణుల నడుమ ప్రగతి భవన్ వద్ద పార్టీ జెండా ఎగురవేసిన డాక్టర్ అప్పలరాజు
- పండగ వాతావరణంలో వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

3లో

# పలాస చరిత్రలో నూతన అధ్యాయం

## ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారంలో చారిత్రక ముందడుగు

**నవతరం -పలాస**



దశాబ్దాలుగా ఉద్దానం ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ మహమ్మారి సమస్య పరిష్కారంలో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక విజయం సాధించింది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో మొట్టమొదటి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను రేపు నిర్వహించనున్నట్లు పలాస శాసనసభ్యురాలు (MLA) శ్రీమతి గౌతు శిరీష ఒక ఉద్విగ్నభరిత ప్రకటనలో తెలిపారు. ఇది కేవలం ఒక ఆపరేషన్ కాదని, ఉద్దానం ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న భరోసా అని, తమ చిత్తశుద్ధికి నిలువుటద్దం అని ఆమె పేర్కొన్నారు.

### తొలి ఆపరేషన్ వివరాలు: తండ్రే దాత

ఈ చారిత్రాత్మక తొలి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను 27 ఏళ్ల హేమశ్రీ అనే యువతికి నిర్వహిస్తున్నారు. ఆమెకు కిడ్నీ దానం చేయడానికి ఆమె తండ్రి, క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీ మోహన్ రావు ముందుకు రావడం విశేషం. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, మరియు వైద్యులు పూర్తి బాధ్యత తీసుకుని ఈ ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. వైజాగ్, శ్రీకాకుళం నుండి ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు గారి ఆధ్వర్యంలో నిపుణులైన వైద్య బృందాన్ని ఈ ఆపరేషన్ కోసం పలాసకు రప్పించారు.

### ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు పెట్టుబడులు

గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి భిన్నంగా, కూటమి ప్రభుత్వం ఉద్దానం సమస్యపై తమకున్న చిత్తశుద్ధిని చేతల్లో చూపిస్తోందని శ్రీమతి శిరీష అన్నారు.

12 కోట్ల కేటాయింపు: కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కోసం మొత్తం 12 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 9 కోట్లు అత్యవసర వైద్య పరికరాలు, పనిముట్ల కోసం, మిగిలిన 3 కోట్లు రీసెర్చ్ గ్రాంట్‌గా కేటాయించారు.

నూతన దయాలసిస్ యూనిట్లు: స్నేహితులు, కలెక్టర్ గారి సహకారంతో -మిగతా 2లో

# అతి త్వరలో ఆరు వరుసల జాతీయ రహదారి



- నితిన్ గడ్కారితో భేటి అయిన రామ్మోహన్ నాయుడు.
- నరసన్నపేట టు ఇచ్చాపురం ఆరువసరాల జాతీయ రహదారి ఆవశ్యకతను వివరించిన రామ్మోహన్ నాయుడు.
- నవభారత్ కూడలిలో ఫ్లై ఓవర్, అండర్ పాస్ వంతెన అవసరాన్ని వివరించిన సిక్కోలు ఎంపి.
- కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం, గార
- అలికాం - బత్తిలి రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని వినతి.
- హామీ ఇచ్చిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కారి.
- తన శాఖకు నివేదిక సిద్ధం చెయ్యాలని ఆదేశాలు.
- పాతపట్నం నీలమణి దుర్గ ఫ్లై ఓవర్ డిజైన్ మార్పులకు అంగీకరించినందుకు కృతజ్ఞత తెలిపిన రామ్మోహన్ నాయుడు.

# 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్

- జిల్లాలో 11,602 కేసులు గుర్తింపు
- జిల్లాలో 20 బెంచ్ లు ఏర్పాటు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

**నవతరం -శ్రీకాకుళం**




జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా గురువారం తెలిపారు. ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్

-మిగతా 2లో

# బొడ్డెపల్లి రాజగోపాలరావు జీవితం భావితరాలకు ఆదర్శప్రాయం



దివంగత నేత మాజీ ఎంపి బొడ్డెపల్లి రాజగోపాలరావు జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని రాష్ట్రపీయూసీ చైర్మన్ కూన రవికుమార్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంలు అన్నారు

4లో

# ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలి

- ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు
- 1000 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



2లో

ఎడిటోరియల్

# నీళ్లు నమిలారు!

పార్లమెంట్ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు పెట్టిన అవిశ్వాసం మలివిడత బడ్జెట్ సమావేశాల్లో చర్చ జరుగుతోంది. సంఖ్యా బలంగా తీర్మానం నెగ్గే అవకాశం లేకున్నా విపక్షాలు మాత్రం చర్చలో నైతిక విజయం సాధించాయి. స్పీకర్ ఏకపక్ష వైఖరిపై సంధించిన ప్రశ్నలు ప్రజాస్వామ్య విలువల్ని నిలబెట్టాయి. అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. అంతేకాదు, సభాపతి వ్యవస్థలో ఉండాల్సిన పారదర్శకతను సైతం గుర్తుచేశాయి. రాజ్యాంగం ప్రకారం స్పీకర్ పదవి 'నిష్పక్షపాత న్యాయమూర్తి' వంటిది. ఒకసారి ఆ పీఠం అధిష్టించాక సభాపతికి పార్టీ రంగు ఉండకూడదు. సభ్యులందరినీ సమానంగా చూడాలి, గౌరవించాలి. అధికారపక్షమే కాదు, మైనార్టీలో ఉన్నవారి హక్కులకూ రక్షణగా నిలబడాలి. కానీ, ఆ పదవి ఒక వ్యక్తికో లేదంటే పార్టీకో కొమ్ముకాసే వేదికగా మారితే అది రాజ్యాంగస్ఫూర్తికి తీవ్ర విఘాతం. స్పీకర్ వ్యవహరిస్తున్న తీరు అచ్చం బీజేపీకి ఏజెంట్‌లాగే ఉందన్నది ప్రతిపక్షాల ఆరోపణ. భిన్నాభిప్రాయాలకు అవకాశ మివ్వక పోవడం, ప్రశ్నలను అణగదొక్క డటం, మాట్లాడుతుంటే మైక్ కట్ చేయడం, సభనుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే చర్యలే తప్ప వేరేకాదు.
స్పీకర్ వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ నూట పద్దెనిమిది మంది విపక్షాల ఎంపీలు తొలివిడత బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయనపై అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. మంగళవారం జరిగిన చర్చలో ఓం బిర్లా తీరుపై ప్రతిపక్షాలు చర్చను తీవ్రతరం చేయగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌రిజిజు ఎదురుదాడి మొదలుపెట్టారు. ఇది అసహేతుకం. బాధ్యతల్లో ఉన్నవారు సభ్యులు వేసే ప్రశ్నలను ఓపిగ్గా వినాలి. వాటికి జవాబు చెప్పాలి. అది ప్రజాస్వామ్యం. కానీ, ఇక్కడ మాత్రం స్పీకర్ నిష్పక్షపాతంగానే ఉన్నారని, ప్రతిపక్షాలే సభను అడ్డుకుంటున్నాయని ఆయన వాదించారు. స్పీకర్ నిజంగా చర్చ సవ్యంగా జరిగేలా చూస్తే సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలి.కానీ, ఎన్డీయే సభ్యులు విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నా వారించలేదు. పైగా ప్రశ్నించేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. గత సమావేశాల్లో రికార్డు స్థాయిలో నూట నలభై ఆరు మంది ఎంపీలను ఒకేసారి సస్పెండ్ చేశారు. భారత పార్లమెంట్ చరిత్రలోనే ఇదొక మాయని మచ్చ. ఇదంతా సభలో విపక్షం లేని ఏకపక్షపాలనకు దారితీయడమే.
చర్చ సందర్భంగా విపక్షాలు లేవనెత్తిన మూడు అంశాలు అధికార పక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రజా సమస్యలు, అధికార పార్టీ వ్యహరిస్తున్న తీరుపై లీడర్ ఆఫ్ అపోజిషన్ (రాహుల్‌గాంధీ)కి మాట్లాడే అవకాశం ఎందుకివ్వలేదని విపక్షాలు నిలదీశాయి. మైక్ కట్‌చేయడం పట్ల అభ్యంతరం చెప్పాయి. అయితే దీనిపై ప్రభుత్వం చెప్పిన సమాధానం వింటే ఎవరికైనా నవ్వురాక మానదు.'సాంకేతిక' కారణాల వల్ల మైక్ ఆగిపోయిందట! తప్ప స్పీకర్ కట్ చేయలేదట. ఇంతకన్నా హాస్యాస్పదం మరొకటి ఉండదేమో! మరి గత ఐదేళ్లుగా డిప్యూటీ స్పీకర్ పదవిని ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించగా ట్రెజరీ బెంచీలు జవాబు చెప్పలేక నీళ్లు నమిలాయి. ఎందుకంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం స్పీకర్ ఎంపిక జరుగుతుంది. సంప్రదాయంగా డిప్యూటీ స్పీకర్ కూడా ఎంపికవ్వాలి. కానీ, ఇక్కడ ఓం బిర్లా ఏకఛత్రాధిపత్యానికి ఇది అవకాశంగా మారింది. ఇది రాజ్యాంగ వ్యవస్థను అసంపూర్ణంగా ఉంచడమే కాదు, ఉల్లంఘించడం కూడా! మరో అంశం. ప్రశ్నించే గొంతులను సభ బయటకు పంపడం క్రమశిక్షణగా అనుకుంటే, అది పార్లమెంటా లేదంటే బీజేపీ కార్యాలయం అనుకోవాలా? దీనికి కూడా సమాధానం కరువైంది.
ఏ చట్టమైనా చేసేటప్పుడు చర్చ జరిగేలా చూడటం, సభ్యులకు ఉన్న అనుమానాలు తొలగించడం సభాపతి బాధ్యత. ఈ ఐదేళ్లుగా చూస్తే ఎక్కువ బిల్లులు ఎటువంటి ముందస్తు చర్చలు లేకుండా నిమిషాల్లోనే ఆమోదం పొందాయి. ఇది పార్లమెంటరీ కమిటీల వ్యవస్థను నిర్వీర్యం చేయడమే. మాట మాట్లాడితే సభను సజావుగా జరగనివ్వాలనే అంశమే ఎక్కువగా అధికారపక్షం నుంచి వినిపించింది. స్పీకర్ స్థానంలో ఉన్నవారు అందరి స్వరాలను వినిపించేలా చూడాలి. ఎప్పుడైతే సభలో ఒకే రకమైన మాట వినపడాలని కోరుకుంటారో అక్కడ చర్చకు తావుండదు, నియంతృత్వమే రాజ్యమేలుతుంది. పార్లమెంట్ అనేది కేవలం బిల్లులు పాస్ చేసే యంత్రం కాదు, ప్రజా ఆకాంక్షల ప్రతిబింబం. ఓటింగ్ ఫలితం ఓం బిర్లాకు అనుకూలంగా ఉండొచ్చు, కానీ సభలో విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నల ముందు సర్కార్ తలవంచక తప్పలేదు. మెజార్టీ ఉందన్న అహంకారం రాజ్యాంగం ముందు చెల్లదని అవిశ్వాసం స్పష్టం చేసింది. సంఖ్యాబలం గెలిచినా, రాజ్యాంగ స్ఫూర్తిని గెలిపించడమే నిజమైన ప్రజాస్వామ్యం. ఇప్పటికైనా స్పీకర్ వ్యవస్థ కోల్పోయిన తన వైభవాన్ని, నిష్పక్షపాతాన్ని తిరిగిపొందాలి. అదే భారత పార్లమెంటుకు గౌరవం.

# పలాస చరిత్రలో నూతన అధ్యాయం

మొదటిపేజీ తరువాయి

IOCL కంపెనీ CSR నిధుల ద్వారా 10 కొత్త డయాలసిస్ యూనిట్లను తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆమె స్పష్టం చేశారు.
అంతర్జాతీయ స్థాయి రీసెర్చ్: అమెరికా నుండి నిపుణులైన డాక్టర్లను రప్పించి, జాతీయ ఇన్స్టిట్యూట్ సహకారంతో కిడ్నీ వ్యాధి మూలాలను కనుగొనేందుకు రీసెర్చ్ ప్రారంభించినట్లు తెలిపారు.
గత ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు
ఈ సందర్భంగా శ్రీమతి శిరీష గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**"ఇల్లు అలకగానే పండగ కాదు":**

గత ఐదేళ్లలో మంత్రిగా ఉండి, స్వయానా వైద్యుడైన మాజీ మంత్రి అప్పలరాజు, ఎన్నికలకు కేవలం నాలుగు నెలల ముందు ముఖ్యమంత్రిని పిలిపించి ఆసుపత్రిని ప్రారంభించారని, అయితే అది కేవలం కంటితుడుపు చర్యేనని విమర్శించారు. "ఇల్లు అలకగానే పండగ కాదు" అన్న సామెతను గుర్తు చేస్తూ, భవనం కడితే సరిపోదని, దానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.
ఒక్క మిషన్ కూడా తేలేకపోయారు: 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు గారు మంజూరు చేసిన 10 డయాలసిస్ యూనిట్లను కొత్త భవనంలోకి మార్చి, తానేదో ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేసుకున్నారే తప్ప, ఒక మంత్రిగా ఒక్క కొత్త డయాలసిస్ మిషన్‌ను కూడా తేలేకపోయారని ఎద్దేవా చేశారు.
చారిత్రక నేపథ్యం: చంద్రబాబు నాయుడి దూరదృష్టి
ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారానికి పునాది వేసింది శ్రీ చంద్రబాబు నాయుడు గారేనని శ్రీమతి శిరీష గుర్తుచేశారు. 2018లో తిత్లీ తుఫాను సమయంలో 12 రోజులు పలాసలోనే ఒక బస్సులో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించినప్పుడు, ఈ ప్రాంతానికి ఒక శాశ్వత పరిష్కారం కోసం కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు ఆయన సంకల్పం చేశారని తెలిపారు. అంతకుముందు 2014-19 హయాంలోనే పాలకొండ, టెక్కలి, పలాస, హరిపురం, ఇచ్ఛాపురంలలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి, రోగులు విశాఖపట్నం వెళ్లే భారాన్ని తగ్గించిన ఘనత కూడా ఆయనదేనని అన్నారు.

**కృతజ్ఞతలు**

ఈ చారిత్రాత్మక ఘట్టం సాకారం కావడానికి సహకరించిన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు, శ్రీ పవన్ కళ్యాణ్, శ్రీ నారా లోకేష్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, వైద్య శాఖా మంత్రి, జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా మంత్రులు శ్రీ అచ్చెన్నాయుడు, శ్రీ రామ్మోహన్ నాయుడు మరియు ప్రతి ఒక్కరికీ ఉద్దానం ప్రజల తరపున ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.
ఒకప్పుడు డయాలసిస్ కోసం విశాఖపట్నం, కిడ్నీ మార్పిడి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన దుస్థితి నుండి, ఈరోజు పలాసలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరిగే స్థాయికి ఎదగడం కూటమి ప్రభుత్వ విజయానికి ప్రతీక అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.


# అన్నదాత సుఖీభవ-పి.యం కిసాన్ పథకం

- జిల్లాలో 279100 రైతు కుటుంబాలకు అన్న దాత సుఖీభవ పథకం
- 3వ విడత గా రూ 111.64 కోట్లు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం-శ్రీకాకుళం**

జిల్లాలో 2,79,100 రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం వస్తుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం "సూపర్ సిక్స్" కార్యక్రమంలో భాగంగా అన్న దాత సుఖీభవ-పి.యం. కిసాన్ పథకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అర్హత కలిగిన ప్రతీ రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం క్రింద సంవత్సరానికి రూ 20,000/- ఇవ్వబడుతుందన్నారు.
3 విడతలుగా విడుదల చేయబడుతుందన్నారు. స్వంత భూమి కలిగి సాగు చేస్తున్న భూ యజమానులకు, ROFR భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబాలకు రూ 20,000/- ( కేంద్ర ప్రభుత్వం వారి పి. యం. కిసాన్ పథకానికి సంబంధించి రూ.6000/-లు కూడా కలుపుకుని ) వారి ఆధార్ నెంబరుతో లింక్ బ్యాంక్ ఖాతాలలోకి చేయబడుతుందన్నారు. శ్రీకాకుళం జిల్లాకి సంబంధించి 279100 రైతు కుటుంబాలకు అన్న దాత సుఖీభవ పథకం క్రింద రూ.4000/-లు చొప్పున 3వ విడతగా రూ.111.64 కోట్లు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు గురువారం (12వ తేదీన) విడుదల చేయుచున్నారు. అలాగే 2,23,350 రైతు కుటుంబాలకు పి.యం కిసాన్ పథకం క్రింద రూ.44.67 కోట్లు భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి విడుదల చేయుచున్నట్లు చెప్పారు. గురువారం మొత్తం రూ.156.31 కోట్లు జమచేయబడుచున్నది. శ్రీకాకుళం జిల్లా నియోజక వర్గాల వారీగా అన్నదాత సుఖీభవ-పి.యం. కిసాన్ పథకం క్రింద విడుదల చేయబడుతున్న పెట్టుబడి సాయం వివరాల స్టేట్మెంట్ జత చేయబడినది.
13వ తేదీన మధ్యాహ్నం 4 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు
టెక్కలి నియోజకవర్గంలో సంతబొమ్మాళి మండలం ఎంపిడిఓ కార్యాలయం ప్రాంగణంలో. వ్యవసాయ శాఖ ఎడిఎ, టెక్కలి 8331056220
నరసన్నపేట నియోజకవర్గంలో నరసన్నపేట మండలం మార్కెట్ కమిటీ ప్రాంగణంలో.. ఎడిఎ, నరసన్నపేట 8331056201
శ్రీకాకుళం నియోజకవర్గంలో.. శ్రీకాకుళం మండలం ఎస్ ఎస్ వలస (ఓపెన్ ప్లేస్) ఎడిఎ, శ్రీకాకుళం, 8331056202..
ఆమదాలవలస నియోజకవర్గంలో..
ఆమదాలవలసలో శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హాల్, కొర్లకోట.. ఎడిఎ-ఎస్టీఎల్, 8331056192
ఎచ్చెర్ల నియోజకవర్గంలో.. రణస్థలం ఎంపిడిఓ ప్రాంగణంలో ఎడిఎ, డిఆర్సీ 8331056182..
పాతపట్నం నియోజకవర్గంలో.. ఎంఎఓ కార్యాలయం ప్రాంగణంలో.. ఎడిఎ, కొత్తూరు, 8331056208
పలాస నియోజకవర్గంలో.. పలాస మండలం బ్రాహ్మణతర్ల ఓపెన్ ప్లేస్, ఎడిఎ పలాస, 8331056199
ఇచ్ఛాపురం నియోజకవర్గంలో... కవిటి మండలం లోల నారాయణమూర్తి కళ్యాణ మండపం.. ఎడిఎ, సోంపేట 8331056197.
ఈ సంవత్సరం శ్రీకాకుళం జిల్లాలో అన్నదాత సుఖీభవ-పి.యం. కిసాన్ 3 ఇన్స్టాల్మెంట్లు మొత్తం కలిపి 279100 రైతు కుటుంబాలకు రూ.526.63 కోట్లు జమ చేయబడినట్లు చెప్పారు.

# ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలి



**నవతరం -ఎచ్చెర్ల**

మార్చి 15 నుంచి పరీక్షలకు హాజరుకానున్న పదోతరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఏడాది పాటు చదివిన అంశాలే కాబట్టి అన్ని ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను చదువుకుంటూ వెళ్లటం ఉత్తమమని చెప్పారు. తద్వారా గతంలో చదివిన విషయాలను మళ్లీ ఒకసారి గమనంలోకి తెచ్చుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల పిల్లలు ఎవ్వరూ ఒత్తిడికి గురికావొద్దని ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే మంచి మార్కులతో విజయం సాధించటం సులభమే అవుతుందని పేర్కొన్నారు. ప్రతీ ఏడాది సుమారు 10వేల మంది విద్యార్థులకు పరీక్షల అట్టలు, పెన్నులు, కంపర్స్ బాక్స్ వంటివి అందజేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా గురువారం నుంచి పంపిణీ ప్రారంభించామని తెలిపారు. 1000 మందికి పైగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశామని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో పరీక్ష రాసి తాము చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్ష సామగ్రి అందజేసిన డాక్టర్ సూర శ్రీనివాసరావుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఒకేసారి మూడు రైల్వే హాల్టులు

- ఫలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ.
- హరిశ్చంద్రపురం, మందస రోడ్, పాతపట్నంలలో మూడు రైళ్లకు నూతన హల్టులు.
- ఈ నెల నాలుగవ తేదిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చెంతకు సమస్య.
- రామ్మోహన్ నాయుడు చొరవతో నేడు పరిష్కారం.
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు.

**నవతరం -శ్రీకాకుళం**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం జిల్లా వాసులకు శుభవార్తను మోసుకువచ్చారు. జిల్లా ప్రజల అవసరాలను పూర్తిగా తీర్చేవిధంగా ఒకేసారి మూడు రైళ్లకు సంబంధించి నూతన హాల్ట్ లను మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించి రైల్వే శాఖ ఉత్తర్వులు విడుదల చెయ్యగా.. వివరాలను రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. వీటి ద్వారా అభివృద్ధి వైపు బలంగా శ్రీకాకుళం అడుగులు వేస్తుందని స్పష్టం చేశారు. ఇక నూతనంగా మంజూరు అయిన హాల్టుల వివరాలను పరిశీలిస్తే.. గుణుపూర్, విశాఖపట్నం మధ్య తిరిగే ప్యాసెంజర్ ట్రైన్ నంబర్ 58505/06 ఇకపై హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ వద్ద ఆగనుంది. అదేవిధంగా రైలు నంబర్ 18525/26 బెర్హంపూర్-విశాఖపట్నం ప్యాసెంజర్ ఇకపై మందస రోడ్ రైల్వే స్టేషన్ లో హాల్ట్ మంజూరు అయింది. వీటితో పాటు రూర్కెల జంక్షన్, గుణుపూర్ మధ్య తిరిగే రాజ్యా రాణి ఎక్స్ ప్రెస్ 18117/18 ఇకపై పాతపట్నం లో కూడా ఆగి.. స్థానిక ప్రయాణీకులకు మరింత ఉపశమనం కల్పించనుంది. తాజా రైలు హాల్టుల గురించి ఇప్పటికే అనేక దఫాలుగా కెంద పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. రైల్వే అధికారులకు, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లతో భేటి అయి అవసరాన్ని వివరించారు. ఈ నెల నాలుగవ తేదిన సైతం అశ్విని వైష్ణవ్ తో ప్రత్యేకంగా భేటి అయిన రామ్మోహన్ నాయుడు.. నూతన హల్టుల మంజూరు తో పాటు కొత్త సర్వీసుల ప్రతిపాదనను సైతం రైల్వే మంత్రి దృష్టిలో ఉంచారు. వాటిలో కొన్ని నేడు మంజూరు కావడం పట్ల రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంజూరుకు పూర్తి తోడ్పాటు అందించిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త హాల్టుల ద్వారా అభివృద్ధి మరింత వేగం పెంచుకుంటుందని, ప్రజా రవాణాను మరింత సులభతరం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రతీ మూలలో అభివృద్ధిని చేరవెయ్యడానికి రవాణానే ప్రధాన సాధనం అని నమ్మే కూటమి సర్కారు.. ఆ దిశగా అన్ని ప్రయత్నాలు చేసి సఫలీకృతం అవుతున్నట్టు తెలిపారు. తాజా హాల్టులను జిల్లా ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి చొరవతో.. కొత్త హాల్టులు మంజూరు కావడం పట్ల జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్

మొదటిపేజీ తరువాయి

నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ లోక్ అదాలత్ కు సంబంధించి జిల్లాలో 11,602 కేసులు గుర్తించడమైనదని, జిల్లా మొత్తం మీద 20 బెంచ్ లు ఏర్పాటు చేయగా జిల్లా కేంద్రంలో 4 బెంచ్ లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ లోక్ అదాలత్ లో రాజీపడదగ్గ కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవచ్చన్నారు. సివిల్, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

**జాతీయ లోక్ అదాలత్ వలన ఉపయోగాలు**

ఈ లోక్ అదాలత్ వలన సమయం, ధనం వృధా కాకుండా ఉంటుందని చెప్పారు. సివిల్ కేసులు రాజీ అయితే మొదట చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి చెల్లస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## గోత్రం అంటే ఏమిటి? గోత్ర వ్యవస్థ

# వేద పండితుడు కౌండిన్య మహర్షి



గౌడ లేదా గౌడ్ బ్రాహ్మణ వంశానికి చెందినవారు, గౌడ చరిత్ర ప్రకారము వీరి మూల పురుషుడు కౌండీన్య మహాఋషి అలాగే పరశు రాముడు కూడా కౌండిన్య వంశలోని వాడే కాబట్టి ఉత్తర భారతానికి చెందిన గౌడ సరస్వతి బ్రాహ్మణులు పరుశురాముణ్ణి వారి దైవంగా కొలుస్తారు. వీరికి పూర్వ కాలంలో ఉపనయ సంస్కారములు, వేదాధికారము కలదు కానీ కాల క్రమేణా కొన్ని చారిత్రిక కారణలరీత్యా వీరు బ్రాహ్మణ స్థాయిని కోల్పోయారు. వీరే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలలో క్షత్రియ స్థాయిని, ఇంకొన్ని రాష్టాలలో బ్రాహ్మణ స్థాయిని కలిగి ఉన్నారు. అనగా గౌడ సారస్వత బ్రాహ్మణులుగా, గౌడ క్షత్రియులు (సోమ వంశ క్షత్రియులు, సహస్రార్జున క్షత్రియులుగా) జైస్వాల్, సౌండి, అనే వైశ్యులుగా కూడా విభజించబడ్డారు. మరికొన్ని రాష్ట్రాల్లో సాధారణ కల్లుగీత కార్మికులుగా కూడా ఉన్నారు. వీరి ఆరాధ్య దైవం, శివుడు, విష్ణువు, ఆదిశక్తి (రేణుకా దేవి) వీరి వంశ ఆవిర్భావము బ్రహ్మ దేవుని నుండి అత్రిమహాముని జననము వారి వంశంవాడే కౌండిన్యుడు అతని వారసులే పంచ గౌడులు అనగా పంచ ఋషులు. క్రమంగా అత్రిమహర్షి నుండి మొదలై కౌండిన్యుడితో ప్రాచుర్యంలోకి వచ్చి, కౌండిన్యుని వంశవృక్షమే నేడు దేశం మొత్తం శాఖోపశాఖలుగా విస్తరింపబడ్డారు.

చరిత్రలోకి వెళ్తే, బెంగాల్లో "గౌడ" ప్రాంతం భారతదేశంలో ఒకప్పుడు రాజ్యాంగా ఉండేది. 1947 లో భారత స్వాతంత్ర్యం తరువాత పశ్చిమ బెంగాల్ ను ఆధునిక రాష్ట్రంగా ఏర్పరచటానికి మరొక రాష్ట్రంతో విలీనం చేయబడింది. గుప్త, పాల, సేన, టర్కు మొఘల్ దాడుల వలన పశ్చిమ బెంగాల్ నుండి గౌడ్ లేదా గౌడ ప్రజలు గౌడ రాజ్యం నుండి దక్షిణ భారతదేశం వైపు వలస వెళ్లారు. గుప్తుల దండయాత్రలతో విసిగిన గౌడ ప్రజలు పశ్చిమ బెంగాల్ దక్షిణ భాగం వైపు ఒరిస్సా గుండాఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కేరళ, కర్ణాటక వైపు అంతటా వ్యాపించి వెళ్లారు. వీరిలో ప్రముఖుడు శశాంక (630 – 637గాణ) బెంగాల్ మొట్ట మొదటి గౌడ రాజు, ఒరిస్సాలోని చిల్కా సరస్సు వరకు తన భూభాగాన్ని విస్తరించి, తన మరణం వరకు గుప్తులను ఓడించి కర్ణాసువరం వద్ద తన రాజధానిని స్థాపించాడు.

ఉత్తర భారతదేశంలోని హర్షవర్ధనుడి ద్వారా మళ్ళీ గౌడ సామ్రాజ్యం దండయాత్రలకు గురి కావడంతో మళ్ళీ దక్షిణ భారతదేశం వైపు గౌడ ప్రజలు బలవంతంగా వలస వెళ్ళడం జరిగింది . పశ్చిమ బెంగాల్ ప్రస్తుత మాల్దా జిల్లా, ఉత్తర బెంగాల్ గేట్వే, ఒకప్పుడు గౌర్-బంగ్లా రాజధాని. గురుపూర అనే నగరం గౌడ నగరంగా గుర్తించబడింది. గౌడ నగరానికి చెందిన ప్రజలు 5 వ శతాబ్దంలో ఉన్న గౌర్ నగరానికి చెందినవారు. పశ్చిమ బెంగాల్లో పాల రాజవంశం లక్ష్మణ్ సేన్ గౌడ్ పాలించబడింది, దీనిని అష్మానాబాటిగా పిలిచేవారు. క్రీ.పూ. 1204 లో బెఖితీర్ ఖల్జీ బెంగాల్ ను జయించే వరకు సేన్ రాజులు బెంగాల్ను పాలించారు.

ఖల్జీ దండయాత్రతో, ఆంధ్రప్రదేశ్ తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, కేరళ వైపు దక్షిణా ఒరిస్సా గుండా వలసవెళ్లారు, రుక్నుద్దిన్ బార్బక్ షా పశ్చిమ బెంగాల్లో గౌడ అనే ఒక రాజ్యాన్ని పాలించాడు. హుసాయ్ షా 15 వ శతాబ్దంలో పశ్చిమ బెంగాల్లో గౌడ సుల్తాన్, ఒకసారి ముస్లింలు ముట్టడించిన తరువాత, గౌడ్ లేదా గౌడ ప్రావిన్స్ పాలకులు ఒరిస్సా ద్వారా ఆంధ్రప్రదేశ్ కర్నాటక ప్రాంతానికి దక్షిణాన వలస వెళ్లారు. తూర్పు చాళుక్యులు సోమవంశ క్షత్రీయులు వీరు ప్రస్తుతం వున్న ఆంధ్రప్రదేశ్లోని వేంగి రాజధానిగా పాలించారు. తూర్పు చాళుక్యులు 7 వ శతాబ్దం నుంచి 1189 వరకు ఆంధ్ర ప్రాంతాలను పాలించారు. వీరు తమ రాజధానిని మొదట గోదావరి జిల్లాలోని నిడదవోలో సమీపంలోని వెంగిలో ఉన్నారు, తరువాత రాజమహేంద్రవరం (రాజమండ్రి) కు మార్చారు. చాళుక్య రాజులు ఆంధ్రప్రదేశ్ లోని గోదావరి జిల్లాలలో సోమేశ్వర భీమేశ్వర్ ఆలయాలలో అనేక ఆలయాలను నిర్మించారు.

చాళుక్య భీమ పశ్చిమ గోదావరిలోని భీమవరం తూర్పు గోదావరి జిల్లాలలో ద్రాక్షరామం భీమేశ్వర దేవాలయాలు నిర్మించారు సా.శ.12వ శతాబ్దము నుండి చాళుక్య చక్రవర్తుల ఆధీనంలో దక్షిణ భారతదేశంలోని ముఖ్య ప్రాంతాలను పాలించారు. మధ్యయుగానికి వొస్తే గౌడ రాజులలో చెప్పుకోదగిన వారు దక్షిణాదిన పదిహేనో శతాబ్దం తర్వాత 1687 నుండి 1724 గోల్కొండని ఏలిన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కర్ణాటక రాష్ట్రములోని మహారాణి తంగమ్మ.అలాగే కన్నడ దేశాన్ని పాలించిన కెంపె గౌడ. ఈయన 1510-1570 మధ్య కాలంలో జీవించాడు. భారతదేశంలో ప్రముఖ నగరమైన బెంగుళూరు (1537లో) ఈయన స్థాపించినదే. కెంపె గౌడ వంశీకులు 18వ శతాబ్దము వరకు కర్ణాటక ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్య ప్రాంతాలను పాలించారు.


గౌడులు కాకతీయ, శ్రీకృష్ణదేవరాయ పరిపాలన కాలంలో వీర సైనికులుగా కూడా పనిచేశారు. వారిలో ముఖ్యుడు రుద్రమగౌడ్.గౌడులు ప్రస్తుతము కొన్ని రాష్ట్రాలలో క్షత్రియ స్థాయిని, కోన్ని రాష్ట్రాలలో బ్రాహ్మణ, వైశ్య స్థాయిని కలిగి ఉన్నారు అనగా గౌడసారస్వత బ్రాహ్మణులుగా, (గోవా కొంకన్ తీర ప్రాంతం) గౌడ క్షత్రియులు (సోమ వంశ క్షత్రియులు), నాడార్ (తమిళనాడు) ఎజువ (కేరళ), గౌడ, ఈడిగ బిలువ,పూజారి (కర్ణాటక) గౌడ్, (తెలంగాణా) సెట్టిబలిజ, గౌడ్, ఈడిగ, శ్రీశయన, యాత, చేగిడి (ఆంధ్రప్రదేశ్) బండారి, శెట్టి, కలాల్ (మహారాష్ట్ర) జైస్వాల్,గౌర్ (ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్) జైస్వాల్ (బిహార్) తల్వార్ (కర్ణాటక తుళు ప్రాంతం) గౌడ్, గౌడ (ఒరిస్సా),కొన్ని రాష్ట్రాలలో క్షత్రియులుగా, సహస్రార్జున క్షత్రియులుగా రాజుపుత్,చౌదరి, సౌండి అనే వైశ్యులుగా కూడా విభజించ బడినారు.వీరి ఆరాధ్య దైవము, శివుడు, విష్ణువు, ఆదిశక్తి (రేణుకా దేవి) వీరు సుమారు శివుడు, విష్ణువు, ఆదిశక్తి (రేణుకా దేవి) వీరు సుమారు 700 సంవత్సరాల నుండి కాకతీయుల చివరి చక్రవర్తి ప్రతాపరుద్రుడి తర్వాత కాలం నుండి మాంసాహారము తినడము అలవాటు చేసుకొన్నారు. గౌడ పురాణము ప్రకారము సరస్వతి నది పరివాక ప్రాంతం నుండి ఉత్తర భారతము ఈశాన్య భారతం దక్షిణాదికి వలస వచ్చారు.

గోత్రం అనేది కులం కాదు. గోత్రం అనేది ఇంటి పేరుకాదు.మీ గోత్రం అంటే మీరు ఏ ఋషి యొక్క మనస్సుకు, ఆలోచనలకు, శక్తికి, అనుసంధానమయ్యారు అన్నదే ప్రతి హిందువును ఒక ఋషి వరకు ఆధ్యాత్మికంగా అనుసంధానించవచ్చు. ఆ ఋషి మీ యొక్క రక్త సంబంధి కాకపోయినా, ఆత్మసంబంది. గోత్ర వ్యవస్థ కులాలకు ముందే ఉన్నది. ఇది ఒక విద్యాపరమైన గుర్తింపు ఋషులు తమ విద్యార్థులకు గోత్రం ఇచ్చేవారు. అది విద్య ద్వారా సంపాదించేది అందువల్ల గోత్రం అనేది శక్తి గుర్తింపు కాదు.జ్ఞానం గుర్తింపు. ప్రతి గోత్రం ఒక మహా ఋషి నుండి వస్తుంది. మొత్తం 49 ప్రధాన గోత్రాలు ఉన్నాయి. ప్రతి గోత్రం ఒక విశిష్ట రంగంలో నిపుణులైన ఋషికి సంబంధించినది.

పూజా కార్యక్రమాలలో, వివాహ సమయాల్లో, యజ్ఞ యాగాది సమయాలలో "సంకల్పము" లో మీ గోత్రాన్ని చెప్పడం వల్ల మీ ఋషి యొక్క ఆత్మ శక్తి పూజలో చేరుతుంది. అట్లాగే వివాహ సమయములో వధూవరుల గోత్రం చెప్పడం విశిష్టత ఇదే. దేవతలు కూడా గోత్ర నియమాలను అనుసరించారు.

శ్రీరాముడి వివాహ సమయంలో రాముడు ఇక్ష్వాకుల వంశం వశిష్ట గోత్రం. సీత జనకుని కూతురు కశ్యప గోత్రం. గొప్ప రాజులు కూడా పూర్వం గోత్రాన్ని గౌరవించేవారు ఇంకా పవిత్రమైనది గోత్ర వ్యవస్థ.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్, ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్ కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488



## జనం గుండెల్లో.. వైయస్సార్సీపి జెండా

నవతరం -పలాస

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ వేడుకలు గురువారం పలాసలో పండగ వాతావరణం లో భారీగా తరలివచ్చిన వైయస్సార్సీపి శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర మాజీ మంత్రి, వైయస్సార్సీపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు నేతృత్వంలో తొలుత కాశీబుగ్గ బస్టాండ్ వద్ద డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి, అలాగే పలాస కిడ్నీ రీసెర్చ్ కేంద్రం వద్ద డాక్టర్ వైయస్ విగ్రహానికి వేర్వేరుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల సమక్షంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వైఎస్ఆర్సిపి కార్యాలయమైన ప్రగతి భవన్ వద్ద పార్టీ జెండాను డాక్టర్ అప్పలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి అధ్యక్షతన భారీ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సిదిరి అప్పలరాజు భారీగా తరలివచ్చిన వైయస్సార్సీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ, దేశంలో అనేక రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ, ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండా సింహం సింగిల్ గా వచ్చినట్లుగా వైఎస్ఆర్సిపి ఆవిర్భవించడమే కాకుండా ప్రజల పక్షాన పోరాడుతూ.. ప్రజలు చేతిలో పాశు పతాస్త్రంగా మారిన వైయస్సార్సీపి పై ప్రజలలో చెక్కుచెదరని నమ్మకం ఉందన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే జనం గుండెల్లో.. వైయస్సార్సీపీ జెండా ఉందన్నారు. ప్రజా సమస్యలే పార్టీ అజెండాగా ప్రజలతోనే 15 ఏళ్లుగా మమేకమై ముందుకు సాగుతుందని డాక్టర్ అప్పలరాజు స్పష్టం చేశారు. ఐదేళ్లపాటు జన రంజకంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిందన్నారు. ఇచ్చిన హామీల కంటే ఎక్కువ అందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఆయన కొనియాడారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవం యా వత్తు ప్రజలను మోసగించడానికే ఉపయోగించారని ఆయన విమర్శించారు. కోవిడ్ కష్టకాలంలోనూ అన్ని పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండాలని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, అందరికీ వైద్యం ఉచితంగా అందించాలని జగన్ ఆలోచించడమే కాక ఆచరణలో చేసి చూపించారన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా వైయస్సార్సీపి నిత్యం ప్రజల పక్షాన ఎన్నో సవాలను ఎదుర్కొంటూ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం ద్వారా ప్రతిపక్ష స్వరాన్ని అణచివేయాలని కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం అనుసరిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్న గాని, ప్రజలకు ఉపయోగ పడిన ఒక్క సంక్షేమ పథకం గాని, అభివృద్ధి పని గానీ చేపట్ట లేకపోయిందని, కేంద్రమంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు గత వైఎస్సార్సీపి ప్రభుత్వం హయాంలో చేపట్టిన ప్రాజెక్టు దగ్గరకు వెళ్లి ఫోటోలు తీసుకుని తామే అభివృద్ధి పనులు డబ్బాలు కొట్టుకుంటున్నాడని డాక్టర్ అప్పలరాజు విమర్శించారు. పలాసలో రైల్వే ఫ్లై ఓవర్ పనులు ఆగిపోతే మళ్లీ పునః ప్రారంభం చేయడంలో స్థానికులను ఒప్పించి, వారికి తగిన ఆర్థిక ప్యాకేజీ తో పాటు ఇంటి స్థలాలు కూడా ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అలాగే మూలపేట పోర్టు వైయస్సార్సీపి ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చితే, ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ఈ పోర్టు వచ్చిందంటూ.. కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రచారం చేసుకుంటే.. ఆశ్చర్యం కలుగుతుందని, కింజరాపు ఎర్రం నాయుడు, కింజరాపు అచ్చం నాయుడు, కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ పోర్టు కోసం ఏదో చేస్తామంటూ.. ఏమీ చేయలేక చేతులు ఎత్తేస్తే.. వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో మూలపేట పోర్టు కోసం స్థానిక ప్రజలను ఒప్పించి.. నిర్వాసితులకు తగిన ఆర్థిక ప్యాకేజీ ఇప్పించి.. చాలా శ్రమించడం జరిగిందని డాక్టర్ అప్పలరాజు వివరించారు. ఒకవేళ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి శ్రీకాకుళం జిల్లా పై అభిమానం ఉంటే వంశధార రెండో దశలో భాగంగా ఎడమ కాలువ నిర్మాణానికి అవసరమైన ప్రాజెక్టు అనుమతుల కోసం ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడి.. సాగునీరు రప్పించడానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తే.. తాము స్వాగతిస్తామని డాక్టర్ అప్పలరాజు హితవు పలికారు. మూడుసార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన కింజరాపు రామ్మోహన్ నాయుడు రైల్వే స్టేషన్లలో స్టీల్ బెంచీలు, తర్వాత సోలార్ లాంప్ లు వేసేమని ప్రచారం కాకుండా జిల్లా ప్రజల ప్రయోజనాల కోసం ఏదైనా కొత్త ఆలోచనతో.. కొత్త ప్రాజెక్ట్ కార్యచరణ చేయాలన్నారు. అదేవిధంగా పలాస ఎమ్మెల్యే కూడా గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో చేపట్టిన అభివృద్ధి పనులు వద్ద ప్రజలను మాయను ప్రదర్శిస్తూ.. శిలాఫలకాలు వేస్తున్న తీరు చూస్తుంటే జుగుప్సాకరంగా ఉందన్నారు. పలాస లో కిడ్నీ రీసెర్చ్ కేంద్రం శంకుస్థాపన.. ప్రారంభోత్సవం నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తే.. తెలుగుదేశం ప్రభుత్వంలో కిడ్నీ హాస్పిటల్ కి నిధులు మంజూరయ్యే అంటూ.. డబ్బాలు కొట్టుకోవడం చూస్తుంటే.. ఆమె చేసిన అభివృద్ధి పనులు దేవత వస్త్రాలు వలే ఉన్నాయి అన్నారు. ఉద్దానం ప్రాంతాన్ని కిడ్నీ వ్యాధి రహిత ప్రాంతంగా ఉండేందుకు వంశధార నదీ జలాలను పలాస తో పాటు ఇచ్చాపురం నియోజకవర్గం వరకు రప్పించి.. ఇంటింటా శుద్ధి చేయబడిన జలాలు సరఫరా చేసేందుకు సుమారు 700 కోట్ల వ్యయంతో డాక్టర్ వైయస్సార్ సుజల ధార ప్రాజెక్టు పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా పలాస- కాశిబుగ్గ మున్సిపాలిటీకి ఎవై ఐ నిధులతో ప్రత్యేకంగా రూ. 110 కోట్లు కేటాయించి, నాటి సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇంటింటా పట్టణ ప్రజలకు మంచినీరు సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రామకృష్ణాపురం వద్ద 62 ఎకరాల భూ సేకరణ చేసి ఇండస్ట్రియల్ పార్క్, అలాగే స్మార్ట్ సిటీ వెంచర్, జగనన్న కాలనీలు , పలాసలో కేటీ రోడ్ విస్తరణ, అక్కుపల్లి రోడ్డు, మందస రోడ్డు తోపాటు గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలో ఆధునికరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. నల్ల బొడ్లూరు కొండ ప్రాంతంలో రక్షణ దళశీ లో పనిచేసిన మాజీ సైనికుల కోసం మరియు ఆర్మీలో ప్రవేశించడానికి ఉత్సాహం చూపే యువత కోసం రెండు గ్రౌండ్లు అవసరం కాగా, అందులో భాగంగా నల్ల బొడ్లూరు లో సామాజిక ప్రయోజనం కోసం తాము అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం తెలుగుదేశంలో తెలుగు తమ్ముళ్లు గ్రావెల్ మాఫియాకు తెగబడుతున్నారని, అలాగే మద్యం మాఫియా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా పలాస ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి దృష్టి సారించాలని ఆయనహితవు పలికారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మరోసారి వైయస్సార్ సిపి ప్రభుత్వం ఏర్పాటు అయ్యేలా కార్యకర్తలు సిద్ధం కావాలని, జగన్ మళ్ళీ సీఎం కావాలని జనం కోరుకున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త మరింతగా కృషి చేయాలని డాక్టర్ అప్పలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పెద్దలు హనుమంతు వెంకట్రావు దొర, జడ్పీ వైస్ చైర్ పర్సన్ ప్రతినిధి పాలిన శ్రావణి శ్రీనివాస్ యాదవ్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగసాయి కృష్ణ యాదవ్, వజ్రపు కొత్తూరు ఎంపీపీ ప్రతినిధి ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్ కుమార్, వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జిల్లా కార్యదర్శులు దువ్వాడ మధుకేశ్వరరావు, అగ్గున సూర్యారావు, సొర్ర ఢిల్లీ శ్వరరావు, వైయస్సార్సీపీ మహిళా నేతలు సుజాత పండయాదవ్,బల్ల లీల కుమారి, సేనాపతి దివ్య, దువ్వాడ రవి, తిర్రి రాజారావు, గౌరీ త్యా డి, అందాల శేషగిరి, రాపాక శేషగిరి, బడగల బాలయ్య, బత్తిన లక్ష్మణ్, మడియ రామకృష్ణ, బాడ జగన్నాయుకులు, సేనాపతి కిషోర్, తలగాన శ్రీరాములు, బాలిగం గున్న నారాయణ, పి వి సతీష్, తూముల శ్రీనివాస్, బి చంద్రకళ, మజ్జి హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## రాజగోపాలరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

స్వర్గీయ బొడ్డెపల్లి రాజగోపాల్ రావు గారి జయంతి సందర్భంగా వారి సేవలను స్మరిస్తూ ఘన నివాళులు అర్పిస్తున్నాను

నవతరం శ్రీకాకుళం :

బొడ్డేపల్లి రాజగోపాలరావు అంటే ఒక వ్యక్తి కాదు.. ఒక వ్యవస్థ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాజగోపాలరావు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ఆరు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై జిల్లా ఖ్యాతిని ఢిల్లీలో ఇనుమడింపజేసిన వ్యక్తని ప్రశంసించారు. శ్రీకాకుళం జిల్లాకు వంశధార ప్రాజెక్టును తీసుకురావడంలో ముఖ్యభూమిక పోషించినట్లు కొనియాడారు. ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లా సమగ్ర అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. అదే స్ఫూర్తితో నేడు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు.

# ఆదర్శ మహిళ మెండ ప్రభకు ఉగాది పురస్కారం

**నవతరం-పొందూరు**



ఈ మండలం బురిడికంచరాం గ్రామానికి చెందిన ఆదర్శ మహిళ, ప్రముఖ దాత, విద్యాభిమాని మెండ ప్రభకు పరాభవనామ సంవత్సర ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్ లోని సృజన ఆర్ట్స్ క్రియేషన్స్ సాంస్కృతిక సంస్థ ఈ మేరకు ఆమెకు ఆహ్వాన పత్రాన్ని పంపారు. నాంపల్లి లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఈ నెల 14న మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే కార్యక్రమంలో ఆదర్శ మహిళ ప్రభను ఘనంగా సత్కరిస్తారు. ఆమె గత రెండు దశాబ్దాల నుంచి పేద విద్యార్థుల చదువుకు గాను చేయూతనిచ్చి ఆదుకున్నారు. పలు పేద కుటుంబాల వారికి పెళ్లిళ్లను పురస్కరించుకుని మంగళ సూత్రాలను కొనుగోలు చేసి సహకరించారు. డొక్కా సీతమ్మను స్ఫూర్తిగా తీసుకుని అన్నదానాల నిర్వహణకు మెండుగా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ఈమె జీవిత భాగస్వామి తవుడు మాస్టారు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. ఆయన కూడా దాతగా, విద్యా ప్రదాతగా ఎనలేని గుర్తింపు పొందారు.

# భేతాళపురంలో వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం



**నవతరం-మందస**

వైఎస్సార్సీపీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మందస మండలం భేతాళపురం గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. పలాస నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టి. అప్పలస్వామి, ఎస్. కృష్ణారావు, కె. మోహన్‌రావు, జి. కపిల్, ఎం. రుషి, జె. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 27, 28, 29 తేదిలలో జిల్లా స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు-2026

**నవతరం-శ్రీకాకుళం**

జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఎ.పి రెవెన్యూ సర్వీసుల సంఘం, శ్రీకాకుళం జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు-2026ను ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. మూడు రోజులపాటు స్థానిక కోడి రామమూర్తి స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడా పోటీలు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నాయకత్వంలో నిర్వహించబడతాయన్నారు. జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు తమ తమ రెవెన్యూ డివిజన్ల తరపున పాల్గొనవలసిందిగా తెలిపారు. ఈ క్రీడా ఉత్సవంలో కలెక్టరేట్, టెక్కలి, శ్రీకాకుళం, పలాస అనే నాలుగు యూనిట్లు పాల్గొని టీమ్ ఈవెంట్లలో పోటీ పడనున్నాయన్నారు. పై టీం ఈవెంట్లతో పాటుగా పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా వివిధ ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కేరమ్స్, చెస్, షేటిల్, మ్యుజికల్ చైర్, స్కిప్పింగ్, షార్ట్ పుట్, వాకింగ్, రన్నింగ్, మొదలగునవి నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఆఫీస్ సబార్డినేట్ నుండి డిప్యూటీ కలెక్టర్, వి.ఆర్.ఎలు, వి.ఆర్.ఓలు, గ్రామ సర్వేయర్లు కూడా పాల్గొంటారన్నారు. రెవెన్యూ ఉద్యోగుల మధ్య ఐక్యత, క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఈ క్రీడా పోటీలు నిర్వహించబడుతున్నాయన్నారు. జిల్లా రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ క్రీడా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎ.పి రెవెన్యూ సర్వీసుల సంఘం, శ్రీకాకుళం జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. టీమ్ ఈవెంట్లకు సంబంధించిన మ్యాచ్లుకు ఈ దినము సంయుక్త కలెక్టర్ ఆద్వర్యంలో డ్రా నిర్వహించబదడినది.



ఈ కార్యక్రమంలో ఎ.పి రెవెన్యూ సర్విసుల సంఘం, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి, బి.వి.వి.ఎన్.రాజు, కోశాధికారి మురళీధర్ నాయక్, కలెక్టరేటే ఎ.ఓ. జి.ఎ.సూర్యనారాయణ, సోనికిరణ్, కామేశ్వరరెడ్డి, నయోమి, మధుప్రియ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

- ప్రధానాచార్యులు ఎమ్. టినేష్
- రవీంద్ర భారతిలో ఘనంగా సైన్స్ ఎక్స్పో మాసం

# విద్యార్థిదశ నుండే విజ్ఞానశాస్త్రంలోని మెలకువలను తెలుసుకోవాలి




**నవతరం-శ్రీకాకుళం**

విద్యార్థిదశ నుండే విజ్ఞానశాస్త్రంలోని మెలకువలను తెలుసుకోవాలని, రవీంద్ర భారతి ప్రధానాచార్యులు ఎమ్. టినేష్ అన్నారు. స్థానిక శ్రీకాకుళం రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్పో మాస సంబరాలు అంబరాన్ని తాకిన రీతిలో యాజమాన్యం నిర్వహించింది. ప్రధాన ఉపాధ్యాయలు ఎమ్. టినేష్ గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలోని వివిధ అంశాలను నమూనాల, నివేదికల రూపంలో ప్రదర్శించడానికి ఒక వేదికను రవీంద్ర భారతి విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా, విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వాక్పటిమను పరిశోధనలోని పదార్థాలు, సాధనాలు నమూనాల నేపథ్యం ద్వారా విజ్ఞాన శాస్త్ర పరిధిని అధ్యయనం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రాజెక్టుల పనిని ఇతరులతో పంచుకోవడం వల్ల ఆ భావనలపై అవగాహన పెరిగి, తద్వారా మిగిలిన విద్యార్థులకు కూడా భాగస్వాములు కావాలన్న భావన కలుగుతుందని, సహచర ఉపాధ్యాయులు చెప్పడం జరిగింది. శోధన,ప్రయోగాలు, ప్రతి ఆకృతీకరణ విశ్లేషణ ద్వారా మరింతగా విజ్ఞాన శాస్త్రములోని మెళకువలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల అభివృద్ధి జరుగుతుందని, భవిషత్ కాలములో విజ్ఞానశాస్త్రముదే అంతిమ విజయముగా ఉండే తరుణములో విద్యార్థులు మరింతగా రాణించి దేశ ప్రఖ్యాతిని ఇనుమడింపజేయాలనీ పాఠశాలల చైర్మన్ ఎంఎస్ మణి అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థి దశ నుండే విజ్ఞాన శాస్త్రంలోని మెలకువలను తెలుసుకుని రాణించడం ద్వారా భవిష్యత్తు అద్భుతంగా, అమోఘముగా ఉంటుందని తద్వారా దేశానికి కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని నార్తాంధ్ర జోనల్ ఇంచార్జ్ ఎన్ వెంకటేష్ అన్నారు. అనంతరం ప్రైమరీ విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలను ఆసక్తిగా తిలకించి, వాటి వివరాలను అడిగి, ఉపయోగాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గురువుకు అండగా పూర్వ విద్యార్థులు

**నవతరం-మందస**



మందస మండలం బహడపల్లి జడ్పీ హైస్కూల్‌లో కమిటీ టీచర్‌గా పనిచేస్తున్న మోహన్‌రావు మాస్టర్ ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న 2002-2003 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు కలిసి తమ గురువుగారికి అండగా నిలుస్తూ రూ.34,000/- రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గురువుగారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఎల్లప్పుడూ తమకు మార్గదర్శకులుగా ఉన్న ఆయనకు ఈ చిన్న సహాయం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మర్ల సంతోష్, భూపతి, వల్లభరావు, కుర్మారావు, రమేష్, తులసి, హేమలత, భువనేష్, తాతారావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అతి త్వరలో ఆరు వరుసల జాతీయ రహదారి

**నవతరం-శ్రీకాకుళం**

కేంద్ర రోడ్డు రవాణా, మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారిని అయన కార్యాలయంలో గురువారం నాడు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భేటి అయ్యారు. పార్లమెంట్ రెండవ విడత బడ్జెట్ సమావేశాల తీరుపై ఇరువురు మంత్రులు కాసేపు చర్చించుకున్నారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులను నితిన్ గడ్కారి దృష్టిలో రామ్మోహన్ నాయుడు ఉంచారు. ఇందులో ప్రధానంగా.. జాతీయ రహదారి - 16లోని నరసన్నపేట నుండి ఇచ్చాపురం వరకు సుమారు వంద కిలోమీటర్ల రహదారిని ఆరు వరుసలు చెయ్యాల్సిందిగా కోరారు. జిల్లాలో మూలపేట పోర్టు శరవేగంగా నిర్మాణం అవుతుండటంకి తోడు.. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పట్టణాలు సైతం అభివృద్ధి చెందుతున్న తరుణంలో, భవిష్యత్ అవసరాలకు, ట్రాఫిక్ నియంత్రణకు ఆరు వరుసల జాతీయ రహధాని అత్యంత అవశ్యం అని పరిస్థితులను రామ్మోహన్ నాయుడు వివరించారు. నరసన్నపేట నుండి ఇచ్చాపురం వరకు ఉన్న ఫ్లై ఓవర్లు అన్ని ఇప్పటికే ఆరువరుసలుగా ఉండటంతో.. కేవలం రహదారులను విస్తరణ చేస్తే సరిపోతుందని తెలిపారు. అదేవిధంగా శ్రీకాకుళం నగరంలోని నవభారత్ కూడలి వద్ద ఫ్లై ఓవర్ లేదా అండర్ పాస్ వంతెన నిర్మాణం గురించి నితిన్ గడ్కారి తో ప్రత్యేకంగా చర్చించారు. శ్రీకాకుళం నగరానికి సంబంధించి జాతీయ రహదారి గతంలో నవభారత్ కూడలి నుండి ప్రారంభమై.. నగరం మధ్యలో నుండి వెళ్లేదని.. కాని నగరానికి వెలుపల అన్ని వసతులతో జాతీయ రహదారి విస్తరణ జరిగిన తరువాత.. ప్రధాన కూడలిగా ఉన్న నవభారత్ జంక్షన్ లో ఎలాంటి అండర్ పాస్ కానీ, ఫ్లై ఓవర్ కాని నిర్మాణం జరగకపోవడం వల్ల స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అప్రమత్తంగా ఉన్నా ప్రమాదాలు సైతం జరుగుతూ ఉన్నాయని.. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిలో నవభారత్ కూడలి ఉన్న కి.మీ.నెం.609o600 వద్ద ఫ్లైఓవర్ లేదా వాహన అండర్‌పాస్ ను త్వరితగతిన ఏర్పాటు చెయ్యాలని నితిన్ గడ్కారిని కోరారు. వినతి పత్రాన్ని అందించారు. అలాగే రాష్ట్ర రహదారులుగా ఉన్న కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం 145 కిలోమీటర్లు , గార - అలికాం - బత్తిలి 118 కిలోమీటర్ల లైన్లను జాతీయ రహదారులుగా మార్చాలని రామ్మోహన్ నాయుడు కోరారు. పాతపట్నం నీలమణి దుర్గ ఆలయం వద్ద నిర్మితమవుతున్న ఫ్లై ఓవర్ వద్ద సాధారణంగా ఉండే ఫ్లై ఓవర్ ఆకృతి గా కాకుండా.. ఆలయం అందరికి కనబడే విధంగా పిల్లర్ తరహా ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగే విధంగా డిజైన్ లో మార్పుకు అంగీకరించినందుకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రులు ఇరువురు జిల్లా పరిస్థితులు, అవసరాలపై సుదీర్ఘంగా చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రహదారుల ప్రాధాన్యత ఎంతో ఉంటుంది అని నమ్మే ఎన్డియే సర్కారు.. తప్పక ఈ ప్రాజెక్ట్ లను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తన శాఖ సిబ్బందికి సంబంధిత ప్రాజెక్టులపై క్షేత్ర స్థాయి పరిస్థితులతో కూడిన నివేదికను సిద్ధం చెయ్యాలని నితిన్ గడ్కారి ఆదేశించారు.

నితిన్ గడ్కారి హామీతో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే.. మరింత వేగంగా వృద్ధివైపు బలమైన అడుగులు వేయ్యొచ్చని స్పష్టం చేశారు.

# బొడ్డెపల్లి రాజగోపాలరావు జీవితం భావితరాలకు ఆదర్శప్రాయం

**నవతరం -శ్రీకాకుళం**

బొడ్డెపల్లి రాజగోపాలరావు 103 జయంతి వేడుకలు గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కుశాల పురం సింహ ద్వారం వద్ద గల రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో వంశధార ప్రాజెక్టు నిర్మాణానికి రాజగోపాలరావు ఆద్యుడని, నమ్మిన సిద్దాంతం కోసం నిలబడిన మహా మనిషి అని కొనియాడారు. బొడ్డెపల్లి సేవలను భావితరాలకు తెలియజేసే బాద్యత అందరిపై ఉందన్నారు. ఆరు సార్లు ఎంపిగా ఎన్నికైన ఘనత ఆయనకే దక్కిందన్నారు. జిల్లాలో సాగు నీరు, రోడ్డులు , విద్య, ఉపాది ఉద్యోగ అవకాశాల కల్పన కోసం రాజగోపాలరావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ పూర్వపు అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త దుప్పల వెంకటరావు, సూర శ్రీనివాసరావు, పప్పల రమేష్, నారాయణ రావు, చింతాడ రామ్మోహనరావు, పప్పల రాధాకృష్ణ, సింహాచలం, సూర్యం కెటి నాయుడు, సీపాన రామారావు, బుడుమూరు సూర్యారావు తదితరులు ఉన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**